# ఆనకట్ట

చింతచెట్టు కింద మేజాబల్ల కేసి చూసి కోపం పట్టలేక అంజిగాడి కోసం దిక్కులు చూసేడు సకల.

"అంజిగా, ఓరంజిగా"

ఉదయం ఏడుగంటల వేళ, చిరుచలిగా ఉంది. సంత ఇంకా ప్రారంభం కాలేదు. దుకాణాల వాళ్లు కొందరు బస్తీల నుంచి మెటాడోర్లలో వచ్చి దిగుతున్నారు. చింత చెట్లకింద ఎవరికి కేటాయించిన స్థలంలో వాళ్లు చాపలుపరుచుకుని, వాటి మీద తమ సరుకుల మూటలు పెట్టి, అక్కడికి కాస్త ఎడంగా ఉన్న రంగూనోడి టీ కొట్టుకి వెళ్లి వేడివేడి టీనీళ్లతో గొంతులు తడుపుకొని వస్తున్నారు.

మేజా బల్లమీది పక్షుల రెట్టలు చూసి చిర్రెత్తుకొచ్చింది సకలకి.

"అంజిగా" అని మరింత గట్టిగా అరిచేడు.

హోటేలు పాకలోంచి రెండు గెంతుల్లో ఉరికి వచ్చేడు అంజిగాడు.

"ఏటబ్బాయా, నీకెన్నిసార్లు సెప్పాల నాది అనుమంతులోరి పేరని? అలా అంజిగా అంజిగా అనకబ్బాయా" అన్నాడు.

"ఏడిసేవులే గాని నీకెన్ని సార్లు సెప్పాల్రా సంతరోజుకి మేజాబల్లని శుబ్రంగా కడిగి నీటుగా పెట్టమని, బల్లనిండా పచ్చుల రెట్టలు సూసేవా ఎంతసయ్యింగా ఉన్నాయో! ఆటిమీదలాగే తొంగుంటన్నావా? ఈ బల్ల ఇలాగుంటే మనకాడ రింకులెవడు తాగుతాడ్రా?"

"ఎంతసేపు, ఛెణంలో బల్లని అద్దంలాగ కడిగెయ్యనూ! నువ్వెల్లి టీ తాగేసిరా" అంటూనే అంజిగాడు నూతి దగ్గరకి పరుగెత్తేడు. ఒక బకెట్టు నీళ్ల తెచ్చి బల్లమీద వంపి చింతచెట్టు మొదట్లో దాచి పెట్టిన జానాబెత్తెడు కొబ్బరీనెల చీపురు తీసుకుని బరా బరా పాముడం మొదలు పెట్టేడు.

అది ఎప్పుడో ఇక్ష్వాకుల కాలం నాటి పాత చెక్కబల్ల.

ఉత్త రోజుల్లో ఆ బల్లని ఎవరూ ఎత్తుకుపోకుండా బల్లకోళ్లని నేలలోకి పాతిపెట్టేసి ఉంచేడు సకల తండ్రి రాంబిల్లి తన హయాంలో. అంజిగాడికి ఇల్లూవాకిలీ అన్నీ ఆ బల్లే. ఎవరైనాపెట్టిందేదో ఆ బల్ల కింద కూచుని తినేసి, ఆ బల్ల మీద పడి నిద్రపోవడం వాడి దినచర్య.

పక్కనే చాపమీద ఉల్లిపాయలు, బంగాళాదుంపలు సర్దుకుంటున్న పాపారావు "నెమ్మది నెమ్మదొరే అంజిగా" అనరిచేడు.

ఆ పక్కనే చాపమీద రంగురంగుల పల్చని టెర్లిన్ బట్టలు సర్దిపెడుతున్న జోగాలు మళ్లీ గెంతుతూ పోతున్న అంజిగాణ్ణి చూస్తూ "ఉంకో బాల్చీ నీళ్లు తెచ్చి పొంపేసీలాగున్నాడీ నా కొడుకు" అని సణుక్కుంటూ అడ్డం నిలబడ్డాడు.

అంజిగాడికి నలభయ్యేళ్లు నెత్తిమీదికొచ్చినా నేలనించి మూడడుగులైనా లేని వాడి శరీరంలాగే బుద్ధీ పెరగలేదు. ఇంకో బకెట్టు నీళ్లు వంపేసి బల్లమీద చీపురుతో మళ్లీ పామడం మొదలుపెట్టేడు.

సకల వచ్చి అడ్డుకోకపోతే ఆ కార్యక్రమం అలా సాగుతూ ఉండేదే.

"ఏటండి సకల గారో, సీపిరికీ కరువేనేటండి? నేనీ సంతకొస్తన్న కాణ్నుంచి సూస్తన్నాను, అంజిగాడు ఆ జానడు సీపురు ముక్కతోనే కనపడతన్నాడు" అన్నాడు నవ్వుతూ జోగాలు.

"సీపిరి కొన్రా అని ఎన్ని రెల్లిచ్చేనో అడగండి, బీడీలు కొనుక్కుని కాల్చేత్తాడెదవ".

తన గురించి వాళ్లలా మాట్లాడుకోవడం చూసి అంజిగాడు బల్లకీ వైపు నుంచి ఆ వైపుకి హుషారుగా గెంతేడు.

"ఈడు ముందుజెలమలో తప్పకుండా కోతై ఉంటాడు" అన్నాడు పాపారావు.

సకల రంగునీళ్ల సీసాలు, నానబెట్టిన సబ్జాగింజల సీసాలు తీసి బల్లమీద సర్దుతున్నాడు.

"ఏటల్లుడూ, తెల్లారిన కాణ్నుంచి నీరంగు నీళ్ల రింకులు జెనానికి తాగించేద్దారనేనేటి అప్పుడే సరంజామా అంతా సర్దేత్తన్నావు. ఎండెక్కేదాకా మా టీనీల్లు తాగనియ్ బాబూ" అనరిచేడు టీ పాకలోంచి రంగూనోడు.

సకల నవ్వేడు.

పక్కనే సేమ్యాకావిడి తెచ్చి దించుకుంటున్న మస్తాను తాత సకల నవ్వు చూసి ముచ్చట పడ్డాడు. "ఆళ్లబాబులాగే ఈడూ మంచి కళైనోడు" అనుకున్నాడు మనసులో.

బల్లమీద సీసాలు సర్దుతున్నా సకల చూపులు మాత్రం అడివిలోంచి జనం సంతలోకొచ్చే కాలిబాటమీదే ఉన్నాయి.

అన్నీ సర్దేక బల్లని అన్ని వైపుల్నించీ పరిశీలించి చూసేడు. ఏదో తోచినట్టై ఆ చివర ప్లాస్టిక్ పూలమ్మే మరియమ్మ దగ్గరకెళ్లి ఓ పూలగుత్తి కొనుక్కొచ్చి బల్లమీద పెట్టేడు. "ఎన్నెల ఈ బల్లని సూసి సేనా బాగుందనుకోవాల'.

'ఆ పిల్ల, ఎన్నెల తలపులో కొస్తేచాలు మనసు గోదారైపోతంది. మనువు నికరవయ్యేక ఎన్నెల నిజంగా ఎన్నెల్లాగే కనపడతంది. ఎప్పుడు సూసినా అప్పుడప్పుడే ఇచ్చుకోబోతున్న కొండ సంపెంగ పువ్వులాగ పసిమించిపోతా కనపడతాది' అనుకున్నాడు సకల. క్రితం వారం సంతకొచ్చినప్పుడు ఆ పిల్ల రూపం ఎలాగుందో కళ్లల్లో కొచ్చింది. పచ్చని పూల పరికిణీ మీద ఎర్రవోణీ ఏసుకుని, పక్కకి అల్లిన జడలో ఎర్రని మందార పువ్వొకటి చెంపమీదికి వాలేలాగ తురుముకుని వొచ్చింది. సంతలో తిరుగుతూ తనని దొంగ సూపులు సూస్తా సూడనట్టు నటించింది.

తనకి తెలీకుండానే తన చూపులు ఆ పిల్ల ఎంటే తిరిగేయి. మంచి ఎండవేళ బుర్రలో బలుబు ఎలిగినట్టై పెద్దగలాసుడు సబ్జాగింజల సర్బత్తు అంజిగాడి చేత పంపించేడు. ముందు వొద్దు వొద్దని కాసేపు బెట్టు సేసింది. ఆనక గలాసందుకుని గటగటా తాగేసింది. తాగేసి, ఎనక్కి తిరిగి తనకేసి సూసి సందమామ నవ్వినట్టు నవ్వింది - సకల పెదవులు నవ్వుతో, ఆనందంతో విచ్చుకున్నాయి.

మెల్లగా పొద్దుపైకి ఎలబారింది.

అడవి నుంచి  జనం కమలాఫలాల గంపల్తో, చింతపండు కావిళ్లతో, కుంకుడు కాయల మూటల్తో రావడం ఆరంభమైంది. యువతరం గిరిజనుల కట్టుబొట్టుల మీద టీవీల, సినిమాల ప్రభావం కొట్టొచ్చినట్టు కనిపిస్తా ఉంది. పాత తరం వాళ్ల కొప్పుల్లో తురుముకున్న అడవిపూల సుగంధం వాళ్లకన్నా ముందే సంతలోకి వచ్చి వ్యాపిస్తా ఉంది.

జనాన్ని చూసి మస్తాను తాత కుంపటి పొయ్యిలోకాసిని బొగ్గులేసి, పాతగుడ్డమీద నాలుగుచుక్కల కిరసనాయిలు పోసి అంటించేడు. ఇంటి దగ్గర నీళ్లల్లో ఉడికించి, బెల్లం గుండ కలిపితెచ్చిన సేమ్యా బిందెని కుంపటి మీదికెక్కించేడు. మెల్లగా వేడెక్కుతున్న సేమ్యా నీళ్లని పెద్దకర్ర తెడ్డుతో కలపడం మొదలెట్టేడు. సకలకి తియతియ్యని ఆసేమ్యా వాసనంటే ఎంతో ఇష్టం. చిన్నప్పుడు తండ్రినడిగి అయిదు పైసలూ, పదిపైసలూ పట్టుకెళ్లి మస్తాను గాజు గ్లాసులో పోసి ఇచ్చే సేమ్యాని వేడి వేడిగా ఊదుకుంటా తాగడం ఇంకా గుర్తుంది. ఎవరన్నా ఏమన్నా అనుకుంటారని గాని, లేకపోతే ఇప్పటికీ మస్తాను ముందు గొంతుక్కూచుని సేమ్యా తాగాలన్పిస్తుంది.

అప్పట్లో మస్తానుని అందరూ కలకత్తా సాయెబు అనేవోళ్లు. మస్తానుకి ఒకకాలు కొయ్యకాలు. మిలట్రీలో ఉండగా యుద్ధంలో కాలుపోయిందని గర్వంగా చెప్తాడిప్పటికీ.

గంపెడు సంసారం, పిల్లా జెల్లాతో ఈ అడివిలోకొచ్చి ఎందుకు కాపరం పెట్టేడో ఎవరికీ తెలీదు.

"సకలబ్బాయా, ఎవలొచ్చేరో సూడు" అంటున్నాడు అంజి.

అంజి భుజం మీద చెయ్యేసి, మరో చేత్తో కర్ర ఊతం పట్టుకుని మెల్లిగా నడిచొస్తున్నాడు గండి పోశయ్య.

"పెద్దయ్యా, బాగున్నావా?" అంటూ సకల ముందుకెళ్లి ముసలాయన్ని నడిపించుకొచ్చి తను కూర్చునే స్టూలు వేసేడు.

"ఏటి పెద్దయ్యా ఇలాగైపోయేవు?" అన్నాడు సకల మళ్లీ.

పోశయ్య సకల కేసి తేరిపార జూసేడు.

"ఇలాగైపోక ఇంకెలాగుంటాన్రా, ఏటిది పొయ్యేకాలమా వొచ్చీ కాలమా" పటపట మంటున్న మోకాళ్లని అతికష్టం మీద వొంచి బల్లమీద కూర్చుంటూ 'అబ్బా' అని మూలిగేడు పోశయ్య.

"అంజీ, పెద్దయ్యకి రెండిడ్లీ ఒక టీ అట్టుకురా" అన్నాడు సకల అతిథి మర్యాద కోసం.

"వొద్దబ్బీ సకిలియ్యా, ఉప్పుడే ఇంటికాడ అంబలితాగి బయలొచ్చేను" అన్నాడు.

"సలాం పోసియ్య బాబా, సేన్నాళ్లకి కనపడ్డావు" అన్నాడు పక్కనించి మస్తాను.

పోశయ్య కళ్లకి చెయ్యి అడ్డంపెట్టుకుని చూసి "ఏటి, మత్తానయ్యేనా, బాగున్నావా సాయిబా? పిల్లాజెల్లా అందరూ బాగున్నారా?" అనడిగేడు.

"ఏం బాగయ్యా, ఆడపిల్లలకి పెళ్లిళ్లు జేసి పంపించీతలికి దేముడు కనిపించేడు. ఇంక మొగకుర్రోళ్లు రెక్కలొచ్చి ఎవడి దారిని ఆడెగిరెల్లిపోయేడు. నాకు మాత్రం ఈ సేమియా కుండ ఎవ్వారం తప్పలేదు. నేనూ, మా బూబమ్మా కలోగెంజో తాగాలకదా మరి" అన్నాడు మస్తాను.

ఈలోపల సకల ఎప్పుడెళ్లేడో సత్తు గ్లాసుతో టీ తెచ్చి ముసలాయనకిచ్చేడు. ఆయనది తాగడం ముగించగానే గ్లాసందుకుని పక్కన పెట్టి, ఆయన కోసం కొనుక్కొచ్చిన చుట్టని నోట్లో పెట్టి, అగ్గిపుల్ల గీసి వెలిగించేడు.

సకల చేసిన మర్యాదకి పోశయ్య మొహం ఆనందంతో వెలిగిపోయింది. ఆపైన కొడుకు గుర్తొచ్చి కళ్లల్లో నీళ్లూరేయి. అది చూసిన సకలకి గతం గుర్తొచ్చి కళ్లు చెమరించేయి.

పోశయ్య చుట్టపొగని రెండు మూడు దమ్ములు గుండెల్నిండా పీల్చి తృప్తిగా తలాడించి, చుట్టని బల్లకేసి రుద్ది ఆర్పి, ముక్కు దగ్గరపెట్టుకుని అపురూపంగా వాసన పీల్చుకుని, మొలగుడ్డలో చుట్టి భద్రంగా దాచుకున్నాడు.

"మీయయ్య ఎలాగున్నాడ్రా సకిలియ్యా" అనడిగేడు సకల వైపు సూసి.

"ఏవుంటం, అలాగే మంచంలో... మాయమ్మకి సేతులెత్తి దణ్ణవెట్టాల ఆడితో అలాగ సాగులాడతన్నందుకు".

"అవునవును, మీయమ్మ సేనా మంచిబొట్టి. అది రాంబిల్లి సేసుకున్న పున్నెం అసుమంటి బారియా దొరకట్టం. నీలాంటి కొడుకుట్టటం కూడా అదురుట్టవేరా. అర్ధంతరంగా ఆడు మంచాన్ని పణ్ణందుకు సదువు మానేసి ఏదో మీ అయ్య ఏపారం అందుకుని సేసుకుంటన్నావు కదా! బతకటానికేదో ఒకటి. అదీ దైర్నవంటే" అని మెచ్చుకోలుగా సూసేడు.

"ఇన్నావా పోసియ్య బాబా, పాపికొండల కాడ అడ్డకట్ట కడతన్నారంట, మనకేసి ఊళ్లన్నీ మునిగిపోతాయంట" అన్నాడు మస్తాను.

పోశయ్య భారంగా తల ఊపేడు. "మన బతుకుల మీద అడ్డకట్టలు లేందెప్పుడు? పోతేపోనీయ్ మస్తానా, మనిసికేది శాసినీతం? ఇయాల్రేపు కొండలు కొండలే మాయమైపోతన్నాయి. నా సిన్నప్పుడు ఎక్కడదాకా ఉండీ అడివి ఎక్కడి కొచ్చిందో సూడు. కాపోయినా ఎవడ్రాలోకువంటే అందరికీ మనవే అంపడతాం. మనపచ్చాన్ని నిలబడ్డానికి మీసవున్న మొగోడేడి ఉప్పుడు? ఆరెక్కడికి పొమ్మంటే అక్కడికే పోదారి. పోనీలే, కాలవలొత్తే తొండలు గుడ్లెట్టే నేలలన్నీ పచ్చబడతాయేమో సూద్దారి, ఎవడికో ఒకడికి మేలు జరగనియ్‌లే" అని ఎటూ పొందకుండా మాట్లాడేడు.

"ఈ ముసలాయిన్లో రోసం పూర్తిగా సచ్చిపోయింది' అని సణుక్కున్నాడు మస్తాను.

"అవునొరే సకిలియ్యా, నువ్వింకా మనువాడవేట్రా? నీతోటోల్లందరూ ఇద్దరు ముగ్గురు బిడ్డల తండ్రులయ్యేరు కానుకుంటన్నావా? మన తెగలో మీసం మొలగానే ఒకింటోడైపోటం రివాజు, అలాక్కాపోతే తలగొట్టేసినట్టు అనుకునీవోళ్లు మా కాలంలో. ఏటో, అంతా మారిపోయింది. పాతికేళ్లొచ్చినా మనువులాడరు. మరింక ముసలికాలానికి బిడ్డల్ని కంటారో ఏటో" సణుక్కుంటూ లేచి నిలబడ్డాడు పోశయ్య. అతని మోకాళ్లు పటపటమన్నాయి మళ్లీ.

"తొరలోనే పప్పన్నం పెట్టబోతన్నాడు సకల, మీకింకా తెల్దేటి?" అన్నాడు మస్తాను.

"ఓరి ఓరి ఓరి అవునంట్రా, మాబాబే మానాయినే" అని సకల తలమీద చెయ్యేసి నిమిరేడు పోశయ్య.

"ఏవనుకోకు పెద్దయ్యా, ఎండనబడి రాలేవని పెద్దల బోయినాలనాడు మీ గూడేనికేసి రాలేదు" అని చేతులు నలుపుకొన్నాడు సకల.

"పర్లేదు పర్లేదులే నాయినా" అన్నాడు పోశయ్య.

"జేగర్త పెద్దయ్యా, ఎండనబడి తిరక్కు, సల్లనేళలోనే ఇంటికెల్లిపో" అన్నాడు సకల.

సరేనని తలవూగిస్తూ సకలని చూసి ఆప్యాయంగా నవ్వేడు పోశయ్య. ముసలాయన్ని కొంతదూరం వెల్లనిచ్చి "ఎవరండీయున, అంత మరియాద సేస్తన్నారు?" అన్నాడు జోగులు. అతనీ మధ్యనే ఈ సంతకొస్తున్నాడు.

"ఏటీ, ఆయన్నే ఎరగవా?" అన్నాడు మస్తాను. "అతనెవరనుకుంటన్నావు, ఒకప్పుడీ సీతారం అడివికి పులి. ఈసుట్టుపక్కల గూడేల తండాలన్నింటికీ ఆయనేపెద్ద. ఏ కొండవాలులో ఎవరెంత పోడెగ సాయం సేసుకోవాలో ఆయనే సెప్పాల. ఏ ఇంట ఏ తగువొచ్చినా ఆయనే ఇప్పాల. ఈ ఏరియాలో కొండపాదాల బూముల్ని సదును సేసి మాగాణి ఎగసాయం ఎలాగ సేసుకోవాలో గిరిజన్లుకి నేర్పిందాయనే. పక్కనే పారుతున్న గోదారి నీళ్లతో బంగారం పండించి గిరిజన బూముల్ని మాగాణి బూములుగా మార్చిందాయనే" మస్తాను తెడ్డును బిందె మీద పెట్టి గుంజుతున్న కుడిచేతిని ఎడం చేత్తో నొక్కుకున్నాడు.

ఇద్దరు పిల్లలు రెండు అర్ధ రూపాయి బిళ్లలు పట్టుకుని వచ్చేరు. వాళ్లకి బుల్లి బుల్లి ప్లాస్టిక్కు గ్లాసుల్లో సేమ్యా పోసి అందించేడు. కుఱ్ఱాళ్లిద్దరూ సేమ్యా ఒలికిపోతుందేమోనని గ్లాసుల్ని జాగ్రత్తగా పట్టుకునెల్లి చింతచెట్టు కింద మట్టిలో చతికిల బడ్డారు.

మొదటి బోణీ డబ్బుల్ని బిందెమీద టకటకాకొట్టి పక్కనే ఉన్న నీళ్ల తొట్టిలో పడేసుకున్నాడు. కాలు కొంచెం కూడదీసుకుని స్టూలుమీద సర్దుకు కూచుని మళ్లీ మొదలెట్టేడు.

"అలాంటి పులిలాంటోడు కొడుకు సేసిన యెవ్వారానికి పిల్లిలాగై పోయేడు. ఉప్పుడింక వొయిసూలేదు, వొంట్లో సత్తువాలేదు".

"అంత కానెవ్వారం ఏంజేసేడేటండి కొడుకు?" అన్నాడు శ్రద్ధగా వింటున్న జోగులు.

"ఈ పోసియ్యకి సింతాలుగాడని ఒక్కడే కొడుకు. ఆడు కూడా కడుపుని పుట్టినోడు కాడు. వొయసైపోతన్నా పిల్లలు కలగలేదీయనకి. ఒకపాలి ఈయనా, బార్యా సింగరమ్మ సింతకాడికి మొక్కు సెల్లించుకోటానికి ఎల్లేరు. ఏయమ్మొదిలేసిందో బొడ్డూడని బొట్టిగాణ్ని అక్కడొదిలేసింది. ఆడీళ్లకి దొరికేడు. ఆణ్ని తెచ్చి సింతాలని పేరెట్టి అత్తారబతంగా పెంచేరు. ఆడాడిందాట పాడింది పాట. ఆడు, ఇడుగో మన సకల కన్నా పెద్దోడే. ఆడు రంపసోడారంలో పదకొండు సదువుతున్నప్పుడు ఎవడో రాజమండ్రి నించి రిక్సాలోవొచ్చి పేపర్లు పంచిపెట్టిపోయేడంట. దాంట్లో ఏటున్నాదీ... పదిపేసైనోడికల్లా నెలకి మూడు వేల జీతంతో ఉన్న ఊళ్లోనే ఉజ్జోగాలిత్తామని ఉందంట. ఇంకేవుంది, సింతాలు ఆపేపరట్టుకుని ఎగురుకుంటావొచ్చి అల్లయ్య పీకిలమీద కూకున్నాడు, నేనింక సదూకోను ఉజ్జోగం సేస్తానని.

ఆ పేపర్లో ఉన్న ఎడ్రసట్టుకుని ఈ తండ్రి ఆ కొడుకు రాజమండ్రి ఎల్లేరు. అక్కడాడి ఆపీసులో మెరిసిపోయీ కుర్చీలు, టేబుళ్ళు, సోపాలు ఉన్నాయంట. ఆ కుర్చీల్లో ఉజ్జోగస్తులు సేనా దర్జాగా కూకున్నారంట. ఇసయం తెల్సి ఎల్లిన జెనం తీర్తంలాగున్నారంట. సాయింత్రం దాకా పడిగాపులుపడి ఈళ్ళు కనుక్కునొచ్చిందేటంటే ముందాడికి పదివేలుకట్టాల. పేర్రాసుకుంటాడు. నెలాగి సర్టిపికెట్లతో బాటు మరోపదివేలు కట్టాల. ఆ మూడోనెల్లో ఈడివూళ్ళో అడుపెట్టిన కోళ్లపారంలో ఈడికుజ్జోగం, నెలకి మూడు వేలు జీతం. మరి ఇరవైవేలు కట్టినందుకు ఈడూ యెజిమానుల్లో ఒకడన్నమాట. దానికి ఏడిదికో పాలి లాబాల్లో వాటా.

అలాగ ఓపికున్నోళ్లు ఎన్నిరవైలైనా కట్టుకోవొచ్చు, అంతలాబం అందుకోవొచ్చు. అదు కాయితమ్మీద సొర్గం సూపించేసేడీళ్లకి. పదో క్లాసుకే ఉజ్జోగం వొచ్చేత్తుంటే ఇంకా సదువెందుకు దండగని పాట మొదలెట్టేడు సింతాలు. పోసియ్య కూడా ఈ పెద్దాయిసులో కొడుకు తమనీ ఊరినీ వొదిలిపోకుండా ఉంటాడని ఆశ పడ్డాడు. ఉన్నకాడికి అమ్మి డబ్బులన్నీ పట్టుకెల్లి ఆడిసేతుల్లో పోసేరు. ఈళ్లని జూసి దైర్నంతో ఊళ్లో సదువుకున్న కుర్రోళ్లందరూ అదేబాట పట్టేరు. అదిగప్పుడే లచ్చనవైన బూవులన్నీ గిరిజనుల సేతుల్లోంచి జారిపోయేయి. వొదులుకుంటే అవకాశం మల్లీరాదన్నట్టు ఎవరికాళ్లు తొందరపడిపోయి బూపేపుట్రా అయిన కాడికమ్ముకుని డబ్బులట్టుకెల్లి కట్టేసేరు. ఈళ్లేనేటి, అన్ని ప్రేంతాలోళ్లు వేల మంది జాయినై పోయేరంట. మూన్నెల్లన్నది ఆర్నెల్లూ పదినెల్లూ గడిసిపోయినై. ఎక్కడా కోళ్లపారమూ లేదు, ఆడిమన్సూ లేదు. సరిగ్గా ఏడాది నాటికి వొచ్చిన కాడికి దండుకుని ఆడుజెండా ఎత్తేసేడు. కనీసం సర్టిపికెట్టైనా తెచ్చుకుందారంటే ఆడి అజాపజా లేదు.

నీ మూలాన్నే మేవిలాగ నస్టపోయేమని ఇటుకేసి జెనమందరూ పోసియ్య పెద్దని పట్టుకున్నారు. ఈ పెద్దాయిన వొంచిన తలెత్తితే ఒట్టు.

అటు సదువుకీ సెడిపోయి, ఉన్న కాడికి బూమీపోయి, ఇటు తండ్రి పరువూ పోయిందని ఏవాలోసించుకున్నాడో సింతాలు, పైవోడికి తెలాల. ఊరి సివర సింతసెట్టుకి ఉరేసుకున్నాడు. కవురు తెలిసీ తెలగానే ఈయన బార్య కుప్పకూలిపోయి ప్రేణాలొదిలేసింది. పెంచిన ప్రేణం గదా! అప్పుణ్నుంచీ నవనాడులూ కుంగిపోయి ఇదిగో ఈ పెద్దాయన ఇలాగైపోయేడు" అని ముగించి, పక్కన కుండ లోంచి గ్లాసుడు నీళ్లు ముంచుకుని తాగేడు మస్తాను.

"అయ్యో, ఎంత పన్జరిగిందీ అన్నాడు జోగులు. "నాకు తెలకడుగుతాను, ఈ సంత కూడా మునిగిపోద్దంటన్నారు నిజవేనేటండే?"

ఏమో ఆపైవాడికెరుక అన్నట్టు రెండు చేతులు పైకి చూపించేడు మస్తాను. అతని మొహంలో సన్నని విషాద వీచిక పారాడింది. మెల్లమెల్లగా సంతలోకి జనం రాక ఎక్కువైంది. చుట్టుపక్కల గిరిజన గ్రామాలన్నిటికీ వారానికో రోజు జరిగే సంత అది. కొండల కోనల వెనకనించి కాలిబాటల్లో, రంగురంగుల కోకల్ని మోగాళ్ల మీదికి కట్టి, చంకన బుట్టల్లో అడవి దినుసులో, కోళ్లో వేసుకుని వస్తున్నారు ఆడంగులు. రావడం రావడమే తెచ్చిన సరుకులు మారుబేరగాళ్లకి అమ్మేసి వాళ్లిచ్చిన పదోపరకో తీసుకుని నచ్చినవి కొనుక్కోడానికి దుకాణాల మధ్య తిరుగుతున్నారు.

సకల డ్రింకుల అమ్మకం జోరందుకుంది. అంజి సాయంతో ఆరెంజి, ద్రాక్ష, నిమ్మ, సబ్జా డ్రింకుల్ని గాజుగ్లాసుల్లో పోసి, కొంచెం పంచదారపాకం, ఓగోలీసోడా పోసి చెమ్చాతో కలిపి, ఎవరేది అడిగితే వాళ్లకది చకచకా అందిస్తున్నాడు.

కొత్తమావాస ముందు ఎండ చుర్రుమని కాల్తోంది. శివరాత్రి వెళ్లిన కాణ్నుంచీ కొత్తమావాస సందడి ముందుగా సంతలోనే ప్రారంభమవుతుంది. ముఖ్యంగా బట్టల దుకాణాలకి గిరాకీ బావుంటుంది.

జోగులుకి ఈ రోజు బేరం బాగుంది. అక్కడి కుర్రకారు అభిరుచి మేరకి ఎరుపు, పసుపు, ఆకుపచ్చ పేంట్లు, టీషర్టులు తెచ్చేడీసారి. గుట్టగా పోసిన బట్టల్లోంచి తమకి కావాల్సిన రంగుల్ని ఏరుకుంటూ కుర్రాళ్లంతా జోగులు దుకాణం చుట్టూ మూగి ఉన్నారు.

పక్కనే ఉన్న సకలకీ ఈరోజు బేరం బాగా ఉంది.

ఎంత పని తొందర్లో ఉన్నా సకల మనసంతా ఎన్నెల ఊహల్తో నిండి పోతావుంది. ఏదో గుర్తుకొచ్చి పెదవుల మీద నవ్వు విరుస్తా వుంది. కళ్లు అరమూతలు పడుతున్నాయి.

మొదటిసారి ఎన్నెల్ని ఎక్కడ చూసేడు....

తల్లి ఏదో కబురు చెప్పి రమ్మంటే సైకిలు మీద మేనత్త ఊరికెళ్లి తిరిగొస్తున్నాడు. సాయంకాలం సూరీడు కొండలవెనక్కి పరుగులు తీస్తున్నవేళ. బాటకిరువైపులా పచ్చని పొగాకుచేలు, పొగాకు పూల పరిమళం చల్లని గాలితో కలిసి దోగాడతా ఉంది. ఉన్నట్టుండి పొగాకుచేను గట్టుమీంచి నారింజరంగు మెరుపు లాగ ఎన్నెల బాటమీదికి దుమికింది.

సకల సైకిలు తొక్కడం మరచిపోయి నిలబడిపోయేడు.

ఆ వెనక చెరుకుతోటలోంచి విరిచి తెచ్చుకున్నట్టుంది, చెరుకు ముక్కని నములుతూ బాటలో నిర్లక్ష్యంగా నడుస్తోంది. పిచ్చుకల కోసం కాబోలు భుజానికి వరికంకుల గుత్తొకటి గడ్డితాడుతో వేళ్లాడేసుకుంది.

అటు చూస్తే కొండమొదట్లో వరిచేను, పక్కనే జొన్నచేను, అక్కడి మంచెమీంచి దిగి వస్తున్నట్టుంది.

పలకరించాలని మనసు కొట్టుకులాడినా గొంతు పెగలక చూస్తా ఉండిపోయేడు.

ఆ రాత్రి కంటిమీదికి నిద్రరాలేదు. ఆపిల్ల తనకోసమే పుట్టినట్టన్పించింది.

పనిగట్టుకుని అటువైపు పదేపదే వెళ్లసాగేడు.

అలాగ నాలుగైదు సార్లు ఎదురుపడ్డాక అతను తనకోసమే వస్తున్నాడని ఎన్నెలకి అర్థమైంది.

అతను ఎదురుపడినప్పుడు చిరునవ్వు నవ్వింది.

సకల ధైర్యం చేసి పలకరించేడు. ఇద్దరూ మనసు విప్పి మాట్లాడుకున్నారు. అతనంటే తనకిష్టమేననీ, పెద్దల్తో మాట్లాడమని చెప్పింది ఎన్నెల. అతనింక ఆలస్యం చెయ్యలేదు. తల్లిని, పెద్దల్ని వాళ్ల గూడేనికి పంపించి పెళ్లి మాటలు జరిపించేడు. పెద్దల భోజనాలు జరిగిపోయేయి.

"రాములోరి పెళ్లయ్యేక లగ్గాలు" అన్నారు పెద్దలు.

సకల ఎన్నెల వేలికి వెండి ఉంగరం తొడిగేడు-

సకల కళ్లు సంతంతా వెతుకుతున్నాయి.

క్రమంగా మధ్యాహ్నామైంది.

"ఈయేల్టికింక రాదేమో' - సకల యాంత్రికంగా పని చేస్తున్నాడు.

సాయంత్రమైంది, పొద్దు వాటారింది. ఎన్నెల జాడలేదు.

ఎన్నెలకి ఒంట్లో బాగోలేదేమో! - రకరకాల ఊహల భయాలు, సకల మొహం కళ తప్పిపోయింది.

వెంటనే వెళ్లి ఏమైందో కనుక్కోవాలన్పించింది.

కాని, ఇప్పుడిక ఇట్నుంచి కొండల మీదుగా ఆళ్లగూడేనికి చేరుకోవడం కష్టం.

రంగూనోడు రెండు ఇలాయిబుడ్లు వెలిగించి పాకలో ఒకటి బైట బడ్డీమీదొకటి పెట్టేడు. బడ్డీమీది దీపం గాలి ఎటువీస్తే అటు వొరిగి నల్లని కిరసనాయిలు పొగని అదే పనిగా వెలిగక్కుతా ఉంది.

మస్తాను ఖాళీ బిందెలొకపక్క, కుంపటి, బొగ్గుల మూట ఓ పక్క కావిట్లో సర్దుకుంటున్నాడు.

దూరాల్నుంచి వొచ్చినోళ్లంతా సరుకులూ, చాపలూ మెటాడోర్లల్లో పడేసుకుని పొద్దు వాటారక ముందే బయలుదేరి పోయేరు. అడివిదారి, పులీపుట్రా ఎదురౌతాయని భయం.

"ఏటి సకలయ్యా, ఇంకా బయల్దేరనేటీ" అని పలకరించేడు మస్తాను తాత -

ఆ రోజొచ్చిన చిల్లర డబ్బులన్నీ అంజిగాడు బల్లమీద వరసలు వరసలుగా పేరుస్తున్నాడు. సకల అవన్నీ కలిపేసి అన్యమనస్కంగా చిక్కంలో వేసుకున్నాడు.

దిగులు మొహం వేసుకుని, సామాన్లన్నీ గూడు రిక్షాలో సర్దుకుని ఇంటిదారి పట్టేడు సకల, రాత్రంతా నిద్రపట్టక అటూ ఇటూ మసల్తానే ఉన్నాడు.

మర్నాడు వేకువనే లేచి చప్పుడు కాకుండా సైకిలు బైటికి తీసేడు. పొద్దు నడినెత్తికి చేరే సరికి ఎన్నెల గూడేనికి చేరుకున్నాడు. ఊళ్లో గంగానమ్మ సంబరం జరుగుతా ఉంది. కాబోయే అల్లుడిగా తనకి కబురందనేలేదు, సకల మనసేదో కీడు శంకించింది.

తప్పెటగుళ్ల హోరునీ, డప్పుల మోతనీ తప్పించుకుని ఎన్నెల ఇంటిని చేరుకున్నాడు.

ఇంటిముందు చెట్టుకింద నులకమంచం మీద కూచుని ఏదో ఆలోచన్లో ఉన్న ఎన్నెల అతన్ని చూసి దిగ్గున లేచింది.

జాలిగా దిగులుగా ఆతన్ని చూసి గుడిసెలోకెళ్లిపోయింది.

సైకిలు స్టాండు వేసి ఆశ్చర్యపోతూ అతను నులకమంచంలో కూలబడ్డాడు.

ఎన్నెల తమ్ముడు బైటికి పోబోతూంటే చెయ్యిపట్టుకున్నాడు సకల.

"మీ అమ్మ అయ్య ఏర్రా?" వస్తున్న కోపాన్ని అణుచుకుంటూ అడిగేడు.

"గంగానమ్మ సంబరానికెల్లేరు, నేనూ అక్కడికే"

"మీ యక్కకేటైంది?"

"ఏమో, నాకేటెరిక, సంబరానికి రానంటంది. మాయందరికీ తిళ్లక్కడే" చెయ్యి విడిపించుకుని పరుగెత్తేడు వాడు.

ఎండనపడి వచ్చిన కాకమీదున్నాడేమో సకల దూకుడుగా గుడిసెలోకెళ్లేడు.

ఒకమూల మోకాళ్లలో తలపెట్టుకుని కూచుని ఏడుస్తోంది ఎన్నెల.

ఆమెనలా చూడగానే మనసు కరిగిపోయింది. వెళ్లి పక్కన చతికిలపడ్డాడు. ఎన్నెల ఎక్కిళ్లుపెడతానే ఉంది.

"ఏటైంది, నిన్నెవరింత బాదించినోల్లు, ఎందుకేడుస్తన్నావు?" చనువుగా ఆమె చెయ్యందుకున్నాడు. మూసిన గుప్పిట్లోంచి తనిచ్చిన ఉంగరం అతని చేతిలోకొచ్చింది. అతను నివ్వెరపోతూ "ఏటిది?" అన్నాడు.

"మన మనువు జరగదంట".

"ఎవడు సెప్పేడు? పెద్దల బోజనాలైన మనువునాపడం ఎవడితరం?"

"అయినాసరే"

"అయినా సరేనా, ఏవంట? అంత కొంపలేం మునిగేయంట?"

"అవును, కొంపలు మునగడమే, మీ ఇల్లు వాకళ్లు, బూమిపుత్రలు పోలారం అడ్డకట్ట నీటినిలవ కింద మునిగిపోతాయంట. మీరు తండాలనించి దూరంగా ఎక్కడికో ఎల్లిపోతారంట, అందుకే మా అయ్య నన్ను నీకియ్యడంట" భోరుమంది ఎన్నెల.

*- 2006 ఆటా (ATA) మొదటి బహుమతి*

*- 2006 'కబురు' ఆటా ప్రత్యేక సావనీర్*

*అక్టోబర్ 2006 'అరుణతార' - మంత్లీ*